క్లుప్తంగా

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ: నిరుపేద విద్యార్థికి రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. కాకినాడ శ్రీచైతన్య కళాశాల్లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువున్న విద్యార్థికి శనివారం క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.35 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు 420 సాధించిన ఆమె రెండో సంవత్సరం ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న సభ్యులు ఈ సాయాన్ని అందించారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ సభ్యులును అభినందించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బి. నరసింహానాయక్, క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ సెక్రటరీ దామెర్ల శ్రీకాంత్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదిత్య ఏడీ నాయుడుకు ఉత్తమ పురస్కారం



కలెక్టర్ షాన్ మోహన్ నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ నాయుడు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడుకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఉత్తమ పురస్కారం అందజేశారు. కలెక్టరేట్ హాల్లో శనివారం నిర్వహించిన రెడ్‌క్రాస్ సోసైటీ వార్షిక సమావేశంలో ఎన్ఎస్ఎస్, రక్తదానశిబిరం, యూత్ రెడ్‌క్రాస్ వంటి వాటిల్లో ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహాన్ చేతుల మీదుగా అందజేశారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరుపేదల కోసం ప్రతి శనివారం సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోటయ్య స్వీట్స్ అధినేత చిట్టి పెద్ది రామకుమార్, కర్నూలు చెందిన కొణిదెల గాయత్రి, పినిశెట్టి సురేష్, పట్టాభిరామయ్య సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

స్పోర్ట్స్ యోగాపై అవగాహన

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్పోర్ట్స్ యోగాలో విద్యార్థులను ప్రోత్సహించాలని యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు కోరారు. శనివారం జగన్నాథపురంలోని రాక్ యోగా అకాడమీలో స్పోర్ట్స్ యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ యోగాసన కోచ్ ధర్మాడి డీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగా గురువు చిట్టిబాబు మాట్లాడుతూ అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఒలింపిక్ పోటీలలో యోగా క్రీడకు స్థానం కల్పించారన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ప్రతిభ చూపిన కె.భాస్కర్ సాయి, లహరి, దుర్గ, చైత్రవాసుకి, లోవరాజు, హరిప్రసాద్, కృష్ణ అంజి, నందకిషోర్, మౌళి, సోనిలను అతిథులు సత్కరించారు.

29న మండల పరిషత్ సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ నాయుడు తెలిపారు. ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

నోనోకార్పస్!

- ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు
- త్వరగా ఎదుగుతాయని నాటిన వైనం
- పూలవాసనతో శ్వాసకోశ వ్యాధులు వస్తాయంటున్న వైద్యులు
- ఎక్కడికక్కడ చెట్లను తొలగిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా మంచి జరగాలనే తీసుకుంటారు. ఆ నిర్ణయం అమలై కాలక్రమంలో ప్రతికూల ఫలితాలను ఇస్తే తప్ప తీసుకున్న నిర్ణయం తప్పని గ్రహించలేని పరిస్థితి ఎదురవుతుంది. నగరంలో ఏపుగా పెరిగి పచ్చదనంతో కనిపిస్తున్న కోనోకార్పస్ మొక్కల పరిస్థితి అలాగే ఉంది. నాడు నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పెద్ద వృక్షాలై అందరూ అనుకున్నట్టే చక్కటి నీడను ఇస్తున్నాయి. అంత వరకే ఆలోచించిన నాటి పాలకులు లేదా అధికారులు వాటి నుంచి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్, పలు ఇతర వాయువులు ప్రజలకు శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతోందని ఆలస్యంగా గురించారు. తాజాగా ఆ చెట్లను తక్షణం తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.

ఏపుగా పెరుగుతాయి. నీరు పట్టాల్సిన పనీ లేదు. పశువులు తినవు.. పెరిగేందుకు ఏ ఆటంకాలు ఉండవని నిర్ణయించి ‘హరిత హారం’లో భాగంగా సుమారు పదేళ్ల క్రితం కోనోకార్పస్ (ఏడు ఆకులు) మొక్కలు నాటారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సుందరీకరణ కోసం ఎక్కడ పడితే అక్కడ నాటారు. నగరంలో సుమారు 35 వేలకు పైగా ఈ మొక్కలు ఉన్నట్లు అధికారుల అంచనా. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగి భారీ వృక్షాలయ్యాయి. వర్షాకాలంలో ఈ చెట్ల పూల పుప్పొడి రేణువులు రోడ్లమీద పడితే అవి గింజలుగా మారి వాటి నుంచి మళ్లీ మొక్కలు పుట్టుకొస్తున్నాయి. ఈ పూల వాసన వల్ల మనుషుల్లో అలెర్జీలు, ఆస్తమా తదితర శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు మేల్కొని ఈ మొక్కలు నాటవద్దని నిర్ణయించి తొలగింపు చర్యల్లో తలమునకలయ్యారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అనే నినాదంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా వర్షాకాలంలో అధిక సంఖ్యలో కోనోకార్పస్ మొక్కలు నాటారు. వేగంగా పెరిగే లక్షణం ఉన్న ఇవి అనతి కాలంలో అమాంతం పెరిగిపోయి నిజంగానే పచ్చదనాన్ని, నీడని ఇచ్చాయి. కాకినాడ నగరంతో పాటు, రూరల్ మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోను, డివైడర్ల మధ్య ఫుట్‌పాత్‌ల వద్ద, పార్కుల వెంట, చెరువుల వెంట వాకింగ్ ట్రాక్‌ల వద్ద వీటిని నాటించారు. ఈ మొక్కలు నాటాలన్న వారి లక్ష్యం అయితే నెరవేరింది కానీ, మరోవైపు అవి విడుదల చేసే వాయువులు, వాసనలు శ్వాసకోస వ్యాధులకు, కంటి జబ్బులు, చర్మంపై దద్దుర్లకు కారణమని తెలుస్తోంది.

ప్లాంటేషన్ ఆపేశారు సరే.. తొలగించరా?

ఇప్పటికే ఈ చెట్ల వల్ల ఎదురయ్యే విపరిణామాలు గ్రహించిన దేశాలు, ఇతర రాష్ట్రాల అధికారులు వీటిపై నిషేధం విధించారు. జిల్లాలో సైతం వీటిని నాటవద్దని నిర్ణయించారు. ఇప్పటికే ఏపుగా పెరిగిన చెట్లను సైతం తొలగిస్తున్నారు. వీటి స్థానంలో మర్రి, వేప, రావి, గానుక వంటి మొక్కలు నాటాలని పలువురు కోరుతున్నారు.



కాకినాడ పాత బస్టాండ్ నుంచి సుందరయ్యభవన్ మీదుగా ఇంద్రపాలెం వంతెనకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు



పార్కుల్లో కోనోకార్పస్ మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మొక్కలు తొలగించండి..



ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలను తక్షణం తొలగించాలి. ఈ చెట్లతో వచ్చే వాసన ఇబ్బంది అని వైద్యులు చెబుతున్నారు. అధికారులు స్పందించి నగరంలోని అన్ని చోట్ల ఈ చెట్ల స్థానంలో మంచి మొక్కలను నాటాలి.

– దూసర్లపూడి రమణరాజు, కాకినాడ పౌరసంఘం కన్వీనర్, సామాజికవేత్త

ప్రమాదకరమైనవే..



కోనోకార్పస్ చెట్లు ప్రమాదకరమైనవే. ఇటీవల కొందరు వీటి బారిన పడినట్లు చెబుతున్నారు. ఇవి ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు వ్యాపించేందుకు కారణమవుతున్నాయి. గుజరాత్, తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే వీటిని నిషేధించారు.

– పృథ్వీచరణ్, కాకినాడ నగరపాలక సంస్థ వైద్యాధికారి

ఇప్పటికే చాలా చెట్లు తొలగించాం



కోనోకార్పస్ చెట్లు ప్రమాదకరమైనవని వింటున్నాం. నగరంలో పెరిగిన చెట్లను తొలగిస్తున్నాం. పార్కుల్లో ఇప్పటికే చాలా చోట్ల వీటిని తొలగించాం. మిగిలిన చోట్ల కూడా తొలగిస్తున్నాం. వీటి స్థానంలో ఇతరత్రా మొక్కలు నాటేలా చూస్తాం.

– జె వెంకటరావు, నగరపాలక సంస్థ కమిషనర్, కాకినాడ

నేడు శాకంబరిగా బాలా త్రిపుర సుందరి



అమ్మవారి అలంకరణకు కూరగాయలతో ఏర్పాట్లు చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక బాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం అమ్మవారు శాకంబరిగా దర్శనమివ్వనున్నారు. ఆలయ కమిటీ, భక్తులు , నాగార్జున ఎరువుల కర్మాగార సిబ్బంది అలంకరణకు కూరగాయాలు, ఆకు కూరలు సమకూర్చారు. చక్రధారి భజన మండలి సభ్యులు, 500 మంది భక్తులు ఆలయంలో అలంకరణ చేస్తున్నట్లు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

కరప: వ్యాయామంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని, హైస్కూల్ స్థాయిలో డ్రిల్ పీరియడ్ కచ్చితంగా అమలుచేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో శనివారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. కరప మండలాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు తీసుకువచ్చి, మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యా పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ మాట్లాడుతూ మండల పరిధిలో 10వ తరగతిలో 92 శాతం ఉత్తీర్ణత, 12 మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.2,419 చొప్పున విలువచేసే స్కూలు కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేటలో ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బందిలి విరీష, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, సర్వ శిక్షాభియాన్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ–2 నామా ఏసుదాసు, యూటీఎఫ్ అధ్యక్షుడు తానీషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తునూ సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికపై సమీక్ష



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజులలో వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్లు, కాలువల్లో పూడిక తొలగింపు శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర అంశాలకు సంబంధించి ఎక్కువగా ఉన్నాయన్నారు. పింఛన్ల పెంపు దరఖాస్తులను తిరస్కరించవద్దని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టాస్క్‌ఫోర్స్ సమావేశం ప్రతి శనివారం జరుగుతుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై జేసీ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. డంపింగ్ యార్డు, పరిశ్రమలు, శ్మశాన వాటికలకు అవసరమైన భూమి, గుర్తింపు, సేకరణ, మ్యూటేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్సీ కార్డుల మంజూరు, పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకుల పంపిణీ వంటి అంశాలపై కలెక్టర్ వారితో సమీక్షించారు. ప్రతి అంశంపైన ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిర్దిష్టమైన కారణాలు లేకుండా దరఖాస్తులు తిరస్కరించవద్దని కలెక్టర్ వారికి సూచించారు. కౌలు రైతు పత్రాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలన్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బి.బాలసరస్వతి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లీన్ కాకినాడ లక్ష్యంగా స్వచ్ఛత వారోత్సవాలు

క్లీన్ కాకినాడ లక్ష్యంగా జిల్లాలో ప్రతి నెల చివరి వారం స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి ఆయన వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్లతో కలిసి గ్రామీణ, మున్సిపాలిటీల పరిధిలో స్వచ్ఛత వారోత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించేలా, క్లీన్ కాకినాడ లక్ష్యంగా స్వచ్ఛతా వారోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ తెలిపారు. వారోత్సవాల్లో జిల్లా వాసులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో ఒక్కొక్క రోజు ఒక అంశంపై ర్యాలీలు, వివిధ అవగాహన, కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజువారీగా అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు.

ఘనంగా అంతర్జాతీయ చదరంగ దినోత్సవం



చదరంగ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ అడ్డాల

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని ఆదిత్య విద్యాసంస్థల్లో శనివారం నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ చదరంగం ఆడడం వల్ల మానసిక సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన చదరంగ పోటీల్లో విజేతలు నిర్మల, బి.నిత్యసంతోషి, డి.దివాకర్, ఎం.సద్గురు స్వామిలకు అడ్డాల బహుమతులు అందుజేశారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ సుగుణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యన్నారాయణ, ఇన్‌చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు తేజేశ్వరరావు, దివాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి మంచిరోజులు



క్రెడాయ్ కాకినాడ శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెంకట రమణారావును సత్కరిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: ఉచిత ఇసుక విధానం అమలుచేయడం వల్ల నిర్మాణరంగం వేగవంతం అవుతుందని క్రెడాయ్ కాకినాడ శాఖ ప్రధానకార్యదర్శి టేకి వెంకట రమణారావు అన్నారు. ప్రధానకార్యదర్శిగా ఎన్నికై భాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం అభినందన సభ జరిగింది. రమణారావు మాట్లాడుతూ కాకినాడ నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాకినాడ శాఖ చైర్మన్ నెక్కంటి శ్రీనివాస్, అధ్యక్షుడు విజయకృష్ణల సహాయ సహకారాలతో భవిష్యత్‌లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జీవోలపై సభ్యులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నిర్మాణరంగ సిబ్బందికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధి కల్పనలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. రాష్ట్ర కమిటీతో అనుసంధానం చేసుకుంటూ బిల్డర్లకు, ఖాతాదారులకు, ఇంజినీర్లకు, అవసరమైన కార్యక్రమాలు చేపడుతూ సమాజాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణరంగ ముడిసరుకులపై వేసిన పన్నుల భారం కూడా తగ్గిస్తే సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

రైతు, కూలీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు తక్షణం రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం రాజశేఖర్, వల్లు రాజబాబు, కేఎస్ శ్రీనివాస్, కె.సింహాచలం, వాసంశెట్టి చంద్రరావు తదితరులు ఉన్నారు.

గెస్ట్ టీచర్ అభ్యర్థులకు 23న ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్ ఖాళీల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీ మంగళవారం పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు అన్ని ఒరిజల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ జిల్లా సమన్వయ కర్త జి.వెంకటరావు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి

- వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు
- కమిషనర్ వెంకటరావు
- పలు ప్రాంతాలలో పర్యటన



మార్కెట్ ప్రాంతంలో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. వర్షాల నేపథ్యంలో శనివారం ఆయన కొత్తపేట మార్కెట్, ఫౌండేషన్ హాస్పిటల్ రోడ్డు, ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీరు నిలువ లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైన్లలో నీరు స్తంభించిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. బొందగుంటలోని వెహికల్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన సందర్శించి అనంతరం మాట్లాడుతూ ఎక్కడైనా ముంపు సమస్య ఉంటే సత్వరమే పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా ఒకటి రెండు రోజుల పాటు వర్షాల ప్రభావం ఉండే అవకాశం ఉందని, ప్రజలు కూడా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడిగా ఉండే ఆహారాన్ని తినడం, పరిసరాల పరిశుభ్రత, బయట నుంచి మాంసాహారాన్ని తీసుకోకుండా దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే డయేరియా వంటి సమస్యల బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ తదితరులున్నారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి

- అందరి సమన్వయంతో పనిచేస్తా
- కరప మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నానాజీ



సమావేశంలో డ్రైన్ల పరిస్థితిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప: రాజకీయ విబేధాలు పక్కనపెట్టి, మండల అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. స్థానిక మండల సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించి బాధ్యత అప్పగించారని, వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజా సమస్యలు పరిష్కారానికి అందరి సమన్వయంలో పనిచేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడకు వెళ్లినా డ్రైన్లు లేవని, తాగునీరు లేదని చెప్పేవారని, అధికారులు గ్రామాల వారీగా ఆయా సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వైద్యాధికారులు, కార్యదర్శులు పారిశుధ్య పనులు నిర్వహిస్తూ, రక్షిత నీరు అందించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, ముంపునకు గురైన పొలాల రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. డ్రెయిన్ల నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే నేడు పొలాలు మునిగాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మార్నెళ్ల శివ, వెలుగుబంటి సీతారామరాఘవ, వాసంశెట్టి రామారావు, బిరుదా శ్రీనివాస అప్పారావు ఆరోపించారు. అలాగే డ్రైనేజీల పరిస్థితిని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఏఈఈ కె.కీర్తి బదులిస్తూ మూడేళ్లుగా ఒకే కాంట్రాక్టర్ గుర్రపుడెక్క తొలగింపునకు టెండర్లు వేయడం వల్ల పనులు సక్రమంగా చేయలేదని వివరించారు. ముందుగా మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది తమను పరిచయం చేసుకుని ఎమ్మెల్యే నానాజీని సత్కరించారు. ఎంపీడీఓ కె.అప్పారావు, ఏఓ జి.భీమేశ్వరరావు, ఏడీఏ కె.బాబూరావు, కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నింగి ఉరిమితే.. నావకు అలజడే..

నింగి నిమ్మళంగా ఉన్నంత వరకే కిందున్నవారు ఎంత ఎగిరినా.. ఎన్ని చిందులేసినా. అదో సరదా. ఒక్కసారి కన్నెర్రజేసి కుంభవృష్టి కురిసినా.. మేఘం ఘర్జించినా.. ఫెళ్లున ఉరిమినా భూమి బద్దలైందా అన్నంతలా జీవరాశి భీతిల్లిపోతుంది. ఎవరికి వారు దాపు చూసుకుని దాక్కోవలసిందే. ఇదిగో ఇక్కడ నావలదీ అదే పరిస్థితి. దివి మేఘావృతమై నాలుగు రోజులుగా ఏకధాటిగా వర్షిస్తుంటే.. నా పరిస్థితి ఏంటని బిక్క మొహమేసుకుని ఒడ్డున అలల ఒరవడికి రెపరెపలాడుతున్నాయి. ఏ రాకాసి అల లాక్కుపోతుందో అని బెదురుగా చూస్తున్నాయి. ఓ పక్క తోటి పడవలు ఇన్నుండగా ఏ అల ఏం చేస్తుందిలే అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ దేనికదే భీరువులై అలలపై అల్లలాడుతున్నాయి. కుంభాభిషేకం రేవు వద్ద శనివారం నాటి దృశ్యం ఇది. – కాకినాడ రూరల్

